




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



ఆదివారం 31 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 363 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్


## పట్టణ పేదలకు ముఖ్యమంత్రి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: పట్టణ పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాల పరిధిలోనే ఆధునిక సౌకర్యాలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిపించి ఏడాది లోపే నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం బంజారాహిల్స్‌లో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్లతో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలా ప్రజలను దూర ప్రాంతాలకు తరలించకుండా ప్రతి నియోజకవర్గ ప్రజలకు అదే నియోజకవర్గంలో ఇళ్లు నిర్మించి అందిస్తామని, ఇది పేదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న కానుక అని పేర్కొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలను ఒకేచోట అందుబాటులోకి తెచ్చేలా సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వంపై భారం లేకుండా ప్రముఖ నిర్మాణ సంస్థలతో ఈ భవనాలు నిర్మింపజేస్తున్నామని వెల్లడించారు. ఫినిక్స్ సంస్థ 30 వేల చదరపు అడుగుల్లో ఈ సముదాయాన్ని నిర్మించనుందని చెప్పారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కార్యాలయాలు పనిచేయనున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలకు ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. వందల ఏళ్లుగా అక్కడ నమాజ్ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజ్ కార్యక్రమాలు నిర్వహించుకునేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ సునీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశమైంది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15న జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.679 మేరకు కమిటీ తొలిసారిగా సమావేశమైంది. జూన్ 4న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించడమే లక్ష్యమని కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తొలి మరియు మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న వారి వివరాలను సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీస్ కేసులు ఎదుర్కొన్న వారు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్లు, విద్యార్థులు, ఆర్టీసీ మరియు సింగరేణి కార్మికులు తదితరులను గుర్తించి గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున గుర్తింపు, గౌరవం అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తోందని, సమాచార సేకరణలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమకారులందరినీ గుర్తించి గౌరవించడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి ఐఎఫ్ఎస్ లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. గవర్నర్ ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సైక్లింగ్ ర్యాలీ ఏర్పాట్లపై ఎల్‌బీ స్టేడియంలోని శాట్స్ కార్యాలయంలో వివిధ సైక్లింగ్ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను ఖరారు చేశారు. 'ఫిట్‌నెస్ కి డోస్-ఆధా గంటా రోజ్' నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్, చురుకైన జీవన విధానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. గచ్చిబౌలి స్టేడియం ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ ర్యాలీ ఐఐఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌస్ జంక్షన్, బిట్స్, కేబుల్ బ్రిడ్జ్, మాదాపూర్, భారతీయ విద్యాభవన్ సెంటర్ రోడ్, బయోడైవర్సిటీ రోడ్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది సైక్లిస్టులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పాల్గొనే వారందరికీ తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తరఫున పతకాలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. డాక్టర్ సోనిబాలా దేవి మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడంతో పాటు పర్యావరణ హిత రవాణా విధానమని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంలో, సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా సామాజిక అనుబంధాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు నమోదు, ఇతర వివరాల కోసం గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె. మధును 9000033100 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.



## మొక్కజొన్న ఈ-వేలంతో ప్రభుత్వానికి రూ.202.56 కోట్ల అదనపు ఆదాయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: వానాకాలం 2025-26 సీజన్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న విక్రయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వినూత్న ఈ-వేలం విధానం ఫలితంగా ప్రభుత్వానికి మునుపటికంటే రూ.202.56 కోట్ల అదనపు విలువ లభించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. మొత్తం 78,916 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 3,80,187 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న విక్రయంలో ఈ ప్రయోజనం సాధ్యమైందన్నారు. గత పదేళ్లుగా మార్క్‌ఫెడ్‌లో గోదాముల వారీగా ఈ-వేలం నిర్వహించడం, ధరలు ఆశించిన స్థాయిలో రాకపోతే టూ బిడ్ సిస్టమ్ ద్వారా ఈ-టెండర్లు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1న నిర్వహించిన ఈ-వేలంలో సగం పరిమాణానికి మెట్రిక్ టన్నుకు సగటున రూ.14,355 ధర లభించగా, మిగిలిన సగం నిల్వలకు బిడ్డర్లు ముందుకు రాలేదన్నారు. అనంతరం ఏప్రిల్ 24న నిర్వహించిన ఈ-టెండర్‌లో టన్నుకు కేవలం రూ.14,010 మాత్రమే లభించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మరియు వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు గత టెండర్‌ను రద్దు చేసి, రాష్ట్రంలోని సమీప గోదాములను భౌగోళిక ప్రాతిపదికన సమీకరించి మొత్తం నిల్వలను 25 లాట్లుగా విభజించి, నిబంధనలను సరళీకృతం చేస్తూ కొత్త ఈ-వేలం నిర్వహించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా బిడ్డర్లు పాల్గొనేలా పోటీ వాతావరణాన్ని పెంచడంతో మే 29న నిర్వహించిన ఈ-వేలంలో మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,337 ధర లభించిందని తెలిపారు. ఇది గత టెండర్‌తో పోలిస్తే టన్నుకు రూ.5,327 అధికమని చెప్పారు. గత టెండర్‌ను ఆమోదించి ఉంటే మొత్తం నిల్వలపై రూ.532.64 కోట్ల విలువ మాత్రమే లభించేదని, అయితే ప్రస్తుత ఈ-వేలంలో హెచ్-1 ధరల ప్రకారం రూ.735.20 కోట్ల విలువ లభించనుండటంతో ప్రభుత్వానికి రూ.202.56 కోట్ల అదనపు ఆదాయం సమకూరిందన్నారు. భౌగోళిక ప్రాతిపదికన లాట్లుగా విభజించి దేశవ్యాప్తంగా బిడ్డర్ల మధ్య పోటీ పెంచిన ప్రభుత్వ నిర్ణయం వల్లే మెరుగైన ధర సాధ్యమైందని, ప్రజాధనాన్ని పరిరక్షిస్తూ ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం సమకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు.

## విద్యార్థులపై పెట్టుబడి అంటే భవిష్యత్ తెలంగాణపై పెట్టుబడే






సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: విద్యను ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై చేసే అత్యంత విలువైన పెట్టుబడిగా భావిస్తూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పేర్కొన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రావు భవన్‌లో నిర్వహించిన అకాడమిక్ సక్సెస్ మీట్-2026 మరియు "జనజాతీయ గరిమ ఉత్సవ్ - బిర్సా లివ్స్ ఇన్ న్యూ భారత్" కార్యక్రమంలో భాగంగా జరిగిన టీజీట ెక్బ్ల్యూఆర్ఈఐఎస్, ఈఎంఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల వార్షిక విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కేవలం పరీక్షా ఫలితాల వేడుక మాత్రమే కాదని, గిరిజన విద్యార్థుల ఆత్మవిశ్వాసం, పట్టుదల, ప్రతిభ, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. బిర్సా ముండా, కొమురం భీం, రాంజీ గోండ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయం కేవలం నినాదం కాదని, విద్య ద్వారానే బడుగు వర్గాలకు సాధికారత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యే పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పేద విద్యార్థి ప్రపంచ స్థాయి అవకాశాలు అందుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఒక విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధిస్తే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన గురుకులాలు నేడు దేశవ్యాప్తంగా ఆదర్శ విద్యాసంస్థలుగా నిలుస్తున్నాయని, 82 వేల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన ఉచిత నివాస విద్య అందిస్తున్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీ ఫలితాల్లో 98.86 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, 56 విద్యాసంస్థలు వంద శాతం ఫలితాలు సాధించాయని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో 86.53 శాతం ఉత్తీర్ణత సాధించారని, జేఈఈ, నీట్, ఈఏపీసెట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని వెల్లడించారు. 2014 నుంచి ఇప్పటి వరకు 2,500 మందికి పైగా గిరిజన విద్యార్థులు దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం గర్వకారణమన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని గిరిజన బాలికల కోసం ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు సమగ్ర విద్య అందించే సైనిక్ స్కూల్ మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 1,185 మంది పార్ట్‌టైం ఉద్యోగుల గౌరవ వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ప్రిన్సిపల్ గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 వరకు ప్రమోషన్ అవకాశాలను 100 శాతానికి పెంచినట్లు వివరించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్స్‌కు నెలకు రూ.5 వేల ప్రత్యేక గౌరవ వేతనం, డిప్యూటీ వార్డెన్లకు ప్రత్యేక భత్యం, వైస్ ప్రిన్సిపాల్స్‌కు అదనపు ప్రోత్సాహక భత్యాల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. గురుకులాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు రూ.72.83 కోట్లతో మరమ్మతులు, నిర్వహణ పనులకు అనుమతులు ఇచ్చామని, ఆధునిక మాడ్యులర్ కిచెన్ల ఏర్పాటుకు రూ.25 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు అన్ని విద్యాసంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ "ఈట్ రైట్" సర్టిఫికేషన్ సాధించామని తెలిపారు. పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.565.32 కోట్ల నిధులు విడుదల చేయడం ద్వారా వేలాది మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం కలిగిందన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ, గాంధీ మెడికల్ కాలేజ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సంస్థలతో కలిసి పరిశోధన, శిక్షణ, రక్తహీనత నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు నరసయ్య ఆలపించిన అంబేద్కర్ గీతం విద్యార్థులను ఉత్తేజపరిచింది. ఈ సందర్భంగా ఎస్ఎస్సీ, ఇంటర్, ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రులు మెమెంటోలు, శాలువాలు, నగదు పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంత్రి , మంత్రి , ఎమ్మెల్సీ , ఎమ్మెల్యేలు , తదితరులు పాల్గొన్నారు.

## మైక్రోసాఫ్ట్‌లో ఏడాదికి రూ.7 లక్షల ప్యాకేజ్‌తో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విద్యార్థుల ఎంపిక



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మరో ఘనత సాధించింది. డేటా సైన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన 14 మంది విద్యార్థుల్లో 11 మంది ప్రముఖ అంతర్జాతీయ సంస్థ లో ఏడాదికి రూ.7 లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విద్యార్థులు మొదటి నుంచే విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రాక్టికల్ ఆధారిత శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలతో అనుసంధానమైన కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో యూనివర్సిటీ ముందంజలో నిలుస్తోంది. ప్రముఖ సంస్థలో విద్యార్థుల ఎంపికతో తెలంగాణ యువతకు నైపుణ్యాధారిత విద్య ఎంతగానో ఉపయోగపడుతోందని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# డిజిపి సీవీ ఆనంద్‌ను కలిసిన కూనంనేని



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ను కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పలు అంశాలపై చర్చించారు. సీవీ ఆనంద్ నాయకత్వంలో పోలీసులు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని, రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు నెలకొనాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేనితో పాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి , సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో ప్రారంభమైన లాడియా ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ఏడో షోరూమ్

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 31, ప్రతినిధి: ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ రంగంలో వినూత్నత, విశ్వసనీయతతో ముందుకు సాగుతున్న సంస్థ ఖమ్మంలో తన ఏడో షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది. "డైమండ్స్ అందరికీ" అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న లాడియా సంస్థ ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ప్రపంచంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఖమ్మంలోని నూతన స్టోర్‌ను ప్రముఖ నటి అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరి మాట్లాడుతూ ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో భారత్ విశేష పురోగతి సాధించిందని, ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు లాడియా కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణలోని ప్రముఖ జ్యువెలరీ కేంద్రం ఖమ్మంలో తమ ఏడో స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ల్యాబ్-గ్రోన్ డైమండ్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగశాలల్లో తయారవుతాయని, సహజ వజ్రాల మాదిరిగానే రిఫ్రాక్టివ్ ఇండెక్స్, ఆప్టికల్ లక్షణాలు కలిగి ఉంటాయని వివరించారు. సహజ వజ్రాలకు ఉపయోగించే అదే కలర్, క్లారిటీ ప్రమాణాలతో వీటిని కూడా గ్రేడ్ చేస్తారని తెలిపారు. లాడియాలో బంగారు ఆభరణాలతో రూపొందించిన డైమండ్స్, సాలిటైర్స్ విస్తృత శ్రేణిలో అందుబాటులో ఉన్నాయని, హారాలు, వడ్డాణాలు, నెక్లెస్‌లు, గాజులు, పెండెంట్లు, బ్రేస్‌లెట్లు, చెవిపోగులు, జుంకాలు, ఉంగరాలు, ప్రత్యేక ల్యాబ్-గ్రోన్ పోల్కీలు వినియోగదారులకు లభ్యమవుతాయని పేర్కొన్నారు. వినియోగదారులు తమకు నచ్చిన డిజైన్‌ను స్వయంగా రూపొందించుకునే ప్రత్యేక కస్టమైజేషన్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐజీఐ సంస్థ నుంచి డైమండ్ ధృవీకరణ పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. 24 క్యారెట్ల పాత బంగారంపై ఫుల్ వాల్యూ గోల్డ్ ఎక్స్ఛేంజ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. డైమండ్ ధరలు ప్రతి క్యారెట్‌కు రూ.24,999 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా మే 30 నుంచి జూన్ 14 వరకు సాలిటైర్ డైమండ్స్‌పై ఫ్లాట్ 25 శాతం డిస్కౌంట్, డైమండ్స్ మరియు మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 15 శాతం డిస్కౌంట్, జీరో వేస్టేజ్ ఆఫర్‌లను ప్రకటించినట్లు సంస్థ వెల్లడించింది.

# శ్రీ నల్లపోచమ్మ జాతరకు టేబుల్ టెన్నిస్ స్టార్ నైనా జైస్వాల్ రాక




సందేశం టైమ్స్, మానూర్, మే 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఏడు గురువారాలు – ఏడు ఆదివారాల జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న ఆరవ ఆదివారం జాతరకు ప్రముఖ భారతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి హాజరవుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన నైనా జైస్వాల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లలో విజేతగా నిలిచి భారతదేశానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ టేబుల్ టెన్నిస్ రంగంలో భారత కీర్తిని చాటిన క్రీడాకారిణిగా ఆమె ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె రాకతో జాతర మహోత్సవాలకు మరింత ప్రత్యేకత చేకూరనుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని జాతర కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 31, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: నేటి తరం యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్చెరు ఎమ్మెల్యే సూచించారు. పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పీపీఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఉదయం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి తన రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడా పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

# సుల్తాన్‌పూర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 31, బి. డేవిడ్: నేటి యువతరానికి స్ఫూర్తి ప్రదాత అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప పరిపాలనాదక్షుడని పటాన్చెరు ఎమ్మెల్యే అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ డివిజన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో రూ.10 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం వేలాది మంది ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ గొప్ప పోరాట యోధుడిగానే కాకుండా సమర్థవంతమైన పరిపాలకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి చరిత్ర, సేవలు, సంక్షేమ భావజాలాన్ని నేటి తరానికి తెలియజేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో శివాజీ విగ్రహాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచులు పట్నం రాజు, భాస్కర్ గౌడ్, పాండు, సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీకాంత్, శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్, గ్రామ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

# పటాన్చెరులో డెకరేషన్ గోదాంలో అగ్నిప్రమాదం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 31, బి. డేవిడ్: పటాన్చెరు పట్టణంలోని ఓ డెకరేషన్ గోదాంలో శనివారం ఆకస్మికంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గోదాం మొత్తం మంటల్లో చిక్కుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించాలి: మంత్రి దామోదర రాజనర్సింహ





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 31, సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాకు వివిధ పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ కింద వచ్చిన నిధులు, వాటి వినియోగం, ఈ సంవత్సరానికి ప్రతిపాదించిన కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక వసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో వాష్‌రూమ్స్, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు, డార్మెంటరీలు, బెడ్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 31, సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీవోలు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వెల్‌నెస్ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: హైదరాబాద్ బేగంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ హాస్పిటల్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఆధునిక వైద్య పరికరాల సామర్థ్యంపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్న మంత్రి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అన్ని సౌకర్యాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో ప్రజా వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు సుమన్ గౌడ్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.15.46 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 31, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.15,46,000 విలువ గల 59 చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని మాజీ సిడిసి చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి తెలిపారు. పంపిణీ చేసిన చెక్కుల్లో సంగారెడ్డి టౌన్‌కు చెందిన 18 మందికి రూ.3,67,500, సంగారెడ్డి మండలానికి చెందిన ముగ్గురికి రూ.97,000, కొండాపూర్ మండలానికి చెందిన 18 మందికి రూ.4,04,000, కంది మండలానికి చెందిన 12 మందికి రూ.3,96,000, ఇతరులకు చెందిన 8 మందికి రూ.2,81,500 విలువైన చెక్కులు అందజేశారు. మొత్తం 59 చెక్కుల ద్వారా రూ.15,46,000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, టీఎన్జీవోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, విఠల్, కౌన్సిలర్లు నాగరాజ్ గౌడ్, నవీన్, శ్రీకాంత్, సర్పంచులు ఉమా సాయిగౌడ్, ఖాజా ఖాన్, ప్రభాకర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ జహీరాబాద్ కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం




సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 31, ప్రతినిధి: స్వచ్ఛ జహీరాబాద్ లక్ష్యంగా జహీరాబాద్ మున్సిపాలిటీ 27వ వార్డులోని సుభాష్‌గంజ్ ప్రాంతంలో శనివారం ప్రత్యేక స్వచ్ఛత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ ప్రవంతి నామరవి కిరణ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో ప్రజలకు పరిశుభ్రత, చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వీధులు, డ్రైనేజీలు, ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని సూచించారు. చెత్త కారణంగా పరిసరాలు కలుషితమై దోమలు, ఈగలు పెరిగి వివిధ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి కుటుంబం పరిశుభ్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మున్సిపాలిటీ తరఫున ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలని, తద్వారా వార్డును శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో "చెత్తను చెత్త బుట్టలో వేద్దాం.. మున్సిపల్ చెత్త బండికి అందిద్దాం" అనే సందేశంతో రూపొందించిన అవగాహన బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ అధికారి రాజ్‌కుమార్, జవాన్ శ్రీధర్, రిసోర్స్ పర్సన్ లక్ష్మి, వార్డు ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో 13వ రోజు కొనసాగిన ఏఎన్ఎంల ధర్నా



సందేశం టైమ్స్, కొల్చారం, జూన్ 1, ప్రతినిధి: కొల్చారం మండల కేంద్రంలో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏఎన్ఎంలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిరసనలో పాల్గొన్న ఏఎన్ఎంలు మాట్లాడుతూ తమకు నెలకు కేవలం రూ.20 వేల వేతనం మాత్రమే అందుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. దీర్ఘకాలంగా ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారం వరకు సమ్మెను విరమించబోమని హెచ్చరించారు.

## పటాన్చెరు, జేపీ కాలనీ డివిజన్లలో ఎయిర్‌టెక్ సిల్ట్ గ్రాబర్ ప్రారంభం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 31, బి. డేవిడ్: పటాన్చెరు మరియు జేపీ కాలనీ డివిజన్లలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.48 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఎయిర్‌టెక్ సిల్ట్ గ్రాబర్‌ను శనివారం ఉదయం పటాన్చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్చెరు, జేపీ కాలనీ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ ప్రేమ్ కుమార్, జావిద్, సూపర్వైజర్ వంశీకృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించిన మరవెల్లి విద్యార్థిని వైష్ణవి



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మే 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని మరవెల్లి గ్రామానికి చెందిన చొక్కారం వైష్ణవి ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) మరవెల్లిలో విద్యాభ్యాసం చేసిన వైష్ణవి తన కృషి, పట్టుదలతో ఈ ఘనత సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం పొందడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వైష్ణవి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామ పెద్దలు, స్థానికులు ఆకాంక్షించారు.



## నారాయణఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కోరిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 31, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, నిలిచిపోయిన ప్రాజెక్టుల పూర్తి, గ్రామీణ మరియు ప్రధాన రహదారుల అభివృద్ధి, పెండింగ్ రోడ్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధుల మంజూరు తదితర అంశాలపై సమగ్ర వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. నారాయణఖేడ్ ప్రాంత వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు వివిధ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్యాకేజీలు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే చూపుతున్న చొరవను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలించి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

## తెలంగాణ రక్షణ సేనలో భారీగా యువత చేరికలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 31, ప్రతినిధి: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) బలోపేతం దిశగా సంగారెడ్డి నియోజకవర్గంలో యువత పెద్ద ఎత్తున ముందుకు వస్తోంది. సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ కల్బగూర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సదాశివపేటలో నిర్వహించిన కార్యక్రమంలో 100 మందికి పైగా యువకులు తెలంగాణ రక్షణ సేనలో చేరి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ ఆత్మగౌరవం, యువత హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం తెలంగాణ రక్షణ సేన కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, స్వాభిమానానికి ప్రతీకగా "పంచజన్యం" నినాదంతో పార్టీ ముందుకు సాగుతోందన్నారు. యువత రాజకీయాలు, సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కవిత నాయకత్వం, పార్టీ కార్యక్రమాల పట్ల ఆకర్షితులైే యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దయాకర్ రెడ్డి వెల్లడించారు.

## అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి నియామకం



సందేశం టైమ్స్, అందోలు, మే 31, మండల్ ప్రతినిధి: అందోలు–జోగిపేట మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతి, అందోలు–జోగిపేట మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకుముందు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన రవీందర్ రామయ్యపేటకు బదిలీ అయిన నేపథ్యంలో ఖాళీ ఏర్పడిన ఈ పదవికి తిరుపతిని నియమించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుపతి నియామకాన్ని స్వాగతించారు.

## గొడవపడిన యువకులపై కేసు నమోదు.. బైండోవర్ చేసిన అందోల్ పోలీసులు



సందేశం టైమ్స్, అందోల్, మే 31, మండల్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన కొందరు యువకులపై అందోల్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇటీవల గ్రామాల్లో చోటుచేసుకున్న గొడవలు, పరస్పర విభేదాల నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని అందోల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గొడవలు, వివాదాలకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలని అధికారులు సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 31, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత ను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారిని ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ను ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం.

## జోగిపేటలో ఆకతాయుల హల్‌చల్.. కారుపై రాళ్లదాడి ఘటన




సందేశం టైమ్స్, అందోల్, మే 31, మండల్ ప్రతినిధి: జోగిపేట హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఆకతాయుల ఆగడాలు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పార్క్ చేసి ఉన్న కారుపై రాళ్లతో దాడి చేసి అద్దాలను ధ్వంసం చేసిన ఘటన కలకలం రేపింది. బాధితుల వివరాల ప్రకారం, కాలనీలో నివాసం ఉంటున్న వ్యక్తి ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన కారుపై కొందరు ఆకతాయులు రాళ్లు విసిరి ముందు అద్దాన్ని పగులగొట్టారు. ఉదయం లేచి చూసిన యజమాని కారు అద్దాలు ధ్వంసమై ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాత్రి వేళల్లో ఆకతాయుల సంచారం పెరిగిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు రాత్రి పహారా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## పత్తి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ తొలగింపు : కేంద్రం



సందేశం టైమ్స్, జాతీయ వార్తలు, మే 31, ప్రతినిధి: విదేశీ పత్తి దిగుమతులపై ఐదు నెలల పాటు కస్టమ్స్ డ్యూటీని మినహాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ మినహాయింపు అమల్లో ఉంటుందని ఆర్థిక శాఖ తెలిపింది. ప్రస్తుతం 11 శాతం ఉన్న ఈ పన్ను తొలగింపు వల్ల ముడిసరుకు ధరలు తగ్గి వస్త్ర తయారీదారులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంది. అదే సమయంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కనీస మద్దతు ధరను పెంచడం వంటి చర్యలు చేపట్టినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

## స్నేహ కార్యక్రమంలో మాక్ పార్లమెంట్.. ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపొందింపు



సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ సంఘాల సభ్యుల మాక్ పార్లమెంట్ నిర్వహించగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలు పోషిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాలల హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రత వంటి అంశాలపై చర్చించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వసతులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం మెరుగుపర్చాలని సూచనలు చేశారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 1930 సైబర్ హెల్ప్‌లైన్ వంటి సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వక్తృత్వ నైపుణ్యాలు, సమస్యల విశ్లేషణ సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు మరియు బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ఉల్లాస్ కార్యక్రమం కింద ట్రైనర్లు, లెర్నర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి అదనపు కలెక్టర్ నాగేష్



సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే లేబర్ హమాలీలను పెంచాలని అదనపు కలెక్టర్ నాగేష్ అధికారులను ఆదేశించారు. చిలిపిచేడ్ మండలంలోని గౌతపూర్ గ్రామ శివారులో ఉన్న దక్కన్ ఆగ్రో రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోదాంను ఆయన సందర్శించి ధాన్యం నిల్వలు, తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నర్సాపూర్‌లోని రెండు గోదాములకు పంపించనున్నామని, మిగతా ధాన్యాన్ని దక్కన్ ఆగ్రో గోదాంలోనే ఖాళీ చేయాలని సూచించారు. లేబర్‌ను పెంచి లారీలు, ట్రాక్టర్లలో ఉన్న ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జహీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఖిల్లా మాత్రమే కాదు.. జిల్లాలో మీరు చూడని అద్భుతాలు ఇవే




సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: మెదక్ మెతుకు సీమ ఒక చారిత్రక నేపథ్యం గల ప్రాంతమని, రాజులు, రాణుల పాలనకు సాక్ష్యంగా నిలిచిన ఈ ప్రాంతంలో నేటికీ అనేక చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని కవి, రచయిత, చరిత్రకారుడు బుర్ర సంతోష్ తెలిపారు. మంజీరా నది జీవనదిగా మెతుకు సీమను సస్యశ్యామలం చేస్తూ పంట పొలాలతో కళకళలాడుతున్న ఈ ప్రాంతం పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు. మెదక్ ఖిల్లా, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల, మెదక్ చర్చి, పోచారం అభయారణ్యం మాత్రమే కాకుండా మరిన్ని చారిత్రక ప్రదేశాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిలో వేల్పుగొండ తుంబురేశ్వర స్వామి ఆలయం కల్యాణి చాళుక్యుల కాలంలో నిర్మించబడి, అనంతరం కాకతీయుల కాలంలో పునర్నిర్మాణం పొందిన వెయ్యేళ్ల నాటి శిల్పకళా వైభవంగా నిలుస్తుందని, నల్లరాతిపై చెక్కిన అద్భుత శిల్పాలు హంపి, హళేబీడు, వరంగల్ రామప్ప, వేయి స్తంభాల గుడిని పోలి ఉంటాయని తెలిపారు. అలాగే మెదక్ ఆర్డీఓ కార్యాలయ భవనం వందేళ్ల క్రితం 1926లో నిజాం పాలన కాలంలో నిర్మించబడిన చారిత్రక నిర్మాణంగా ప్రత్యేకతను కలిగి ఉందని పేర్కొన్నారు.



## త్వరిత గతిన భూ సేకరణ జరగాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: మెదక్ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ మధు, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రావతి, మేనేజర్ శ్రీవాణి, జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సంగీతతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మెదక్ జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఉన్న అడ్డంకులను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు.. రైతులకు రూ.512.87 కోట్లు చెల్లింపు : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 64,493 మంది రైతుల నుంచి 3,05,018.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 47,436 మంది రైతులకు రూ.512.87 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలోని 40 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పూర్తయిన నేపథ్యంలో వాటిని మూసివేయడం జరిగిందని తెలిపారు. మరోవైపు మెదక్ జిల్లాలోని పురాతన పర్యాటక ప్రాంతాలకు పూర్వవైభవం తీసుకువచ్చేలా టూరిజం శాఖ సమన్వయంతో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. వీడియో సమావేశ మందిరంలో డెక్కన్ టెరైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్‌తో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించిన బృందం సూచనల ఆధారంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రామచంద్రరాజు, డెక్కన్ టెరైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యశాలలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్, మే 31, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 మొదటి రోజు జిల్లా కార్యశాల నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు, జిల్లా ప్రశిక్షణ ఇంచార్జీ కట్ట సుధాకర్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ బొక్క నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు సిద్ధాంతిక భూమిక, బీజేపీ చరిత్ర వికాసం, సోషల్ మీడియా ప్రాముఖ్యత, మీడియా నిర్వహణ మరియు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పదాధికారులు, జిల్లా నాయకులు, మండల మరియు పట్టణ అధ్యక్షులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగూర్ ప్రాజెక్ట్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ ఆక్రమణలపై తక్షణ విచారణ జరపాలి – మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ డిమాండ్



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి మే 31, సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మత్తుల కోసం నీటిని ఖాళీ చేసిన సమయంలో ముంపు ప్రాంతం (ఎఫ్‌టీఎల్) పరిధిలో భారీగా అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు, ఈ అంశంపై తక్షణ విచారణ జరపాలని ఆయన అధికారులను కోరారు, వటపల్లి మండలం కాదిరాబాద్ శివారులోని ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు వ్యక్తులు భూస్వరూపాన్ని మార్చుతూ, చెరువు కట్టలను ధ్వంసం చేస్తూ, అక్రమ రోడ్లు, నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు, అంతేకాకుండా విద్యుత్ శాఖ అనుమతి లేకుండా కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో భూమిని చదును చేయడం జరుగుతోందని తెలిపారు, ఈ ప్రాంతంలో టూరిజం రిసార్ట్, బోటింగ్ వ్యాపారం పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు, ఇది పర్యావరణ చట్టాలు, వాల్టా చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు, అధికార పక్షానికి చెందిన కొంతమంది ప్రభావవంతుల ఒత్తిడితో స్థానిక అధికారులు స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, కావున రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో ఉమ్మడి విచారణ నిర్వహించి, అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## వరి కొయ్యలను కాల్చకుండా పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలి – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్ సూర్యాపేట, మే 31 ప్రకారం, వరి పంట కోసిన తర్వాత పొలాల్లో మిగిలే వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమి సారవంతం కోల్పోవడం, పంట దిగుబడి తగ్గడం, వాతావరణ కాలుష్యం పెరగడం వంటి అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు విజ్ఞప్తి చేశారు, శనివారం ఆయన సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి వరి కొయ్యలను తగలబెట్టకూడదనే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చితే భూమిలోని సారవంతమైన గుణాలు తగ్గిపోతాయని, తద్వారా పంట దిగుబడి తగ్గి రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు, అదనంగా భూమిని దున్నినప్పటికీ సరైన ఫలితం రాకపోవడం వల్ల ఎక్కువ ఎరువులు వాడాల్సి వస్తుందని, ఇది రైతులపై అదనపు భారం అవుతుందని పేర్కొన్నారు, వరి కొయ్యలు కాల్చడం వల్ల పొగ కారణంగా వాతావరణ కాలుష్యం పెరిగి రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతాయని, అలాగే సమీపంలోని చెట్లు, ఆస్తులు, వ్యవసాయ పరికరాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు, అందువల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను తగలబెట్టవద్దని సూచించారు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని, ఇది చట్టరీత్యా నేరమని, ఎవరైనా తగలబెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎసిపి ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఏఓ కృష్ణ సందీప్, సర్పంచ్ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.